# కథానిక

## 'అగ్నిజ్వాల'

(ప)విత్ర భారతదేశంలో ఇరవై ఎనిమిదేళ్ళ క్రితం విజ్ఞానపు ఛాయలు అప్పుడప్పుడే వరచు కొంటున్న (ఈ) గ్రామంలో పుట్టేను. మొదటిసారి ఎందుకీ లోకానికొచ్చేనా అని ఏడ్చాను. అప్పటి నుంచి ఇప్పటిదాకా ముఖం మీద అనుభవాల ముడతలు పడేవరకు మిగిలి ఉన్నాను. ఇరవై ఎనిమిదేళ్ళకే నేను ముసలాణ్ణయి పోయేను. నా జీవితంలో నేను మనస్ఫూర్తిగా రెండే రెండు సార్లు నవ్వాను. చిన్నప్పుడు వీధిబడిలో పిలక జుట్టు బ్రాహ్మణీకపు మేష్టారు నా ప్రత్యర్థిగాణ్ని తిడుతుంటే అప్పుడు నవ్వాను. ఈనాడు నన్ను ఉరితీయ బోతున్నట్లు తెలిస్తే అప్పుడు నవ్వాను. ఒకటి శాడిజంతో కూడిన నవ్వు, రెండవది వేదాంత వరంగా నవ్విన నవ్వు, నాజీవితం ఒక అతుకుల బొంత. ఎంత నైపుణ్యంగా అతికినా అది అతుకుగా వరులకు గోచరిస్తూనే ఉంది. 'నమ్మకం' అన్నమాటకు నా బ్రతుకులో పూర్తిగా అర్థం మాసిపోయింది. జీవితపు దారిలో కనపడిన ప్రతిఒక్కరు నాకు నమ్మకమనే ఎరచూపి దోచుకున్నారు. నిలువు దోపిడీ చేశారు.

### 1. ప్రారంభం.

సారా బుడ్డినీ, సాని కొంపనీ అనుక్షణం వలచే తండ్రి, పాచిపని చేస్తూ రెక్కలు ముక్కలు చేసుకుని నన్ను చదివించే తల్లి, అతిచిన్న వయసులోనే అడవికివెళ్ళి చిదుకులు ప్రోగుచేసే చెల్లి. వీళ్ళే తొలి దశలో సహోదరులు, ప్రభుత్వం వారు చేసిన ప్రకటన విని, తల్లికి బలవంతంగా ఆపరేషన్ చేసి, ఆ డబ్బుతో కులికాడు తండ్రి. తల్లిని డబ్బు యిమ్మని అనుక్షణం వేధించాడు. ఒక రోజు తాగి వచ్చి తల్లిని దారుణంగా కొట్టి తిట్టి హింసించాడు. ఫలితంగా తల్లి మంచాన పడింది. నా చదువు ఐదవ తరగతి లోనే మూల పడింది. నేను అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి, అమ్మి వచ్చిన డబ్బుతో సరకులు తెచ్చే వాడిని. మా గ్రామంలో కట్టెలు కొనే నాథుడే లేడు. ఈ కారణం వల్ల పక్కన - పట్నానికి వెళ్ళి అమ్మేవాడిని. ఒక రోజు టికెట్ లేకుండా



ప్రయాణం చేస్తున్న కారణాన టి. సి. నాతో ఘర్షణ పడ్డాడు. కోపం పట్టలేక నేను చాటుగా అతన్ని రైల్లో నుంచి తోసేశాను. ఆ విసురుకి అతను అవతలి లైను మీద పడ్డాడు. అటువైపు వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు అతని కాళ్ళని బలి తీసు

కుంది. నేను పరారీ అయ్యాను. మొట్ట మొదటి సారిగా జనంలో నాపై నేరస్తుడనే అభిప్రాయం ఏర్పడింది.

## 2. చితిమంటలు

అది మొదలు నేను ఇంటి మీద దిగులుతో కృంగిపోసాగాను. ఇంటికి వెళ్ళాలంటే భయం వేయసాగింది. జీవితంలో ఎప్పుడు ఎరుగని కష్టాలు ప్రారంభమయినవి. నా పరిస్థితి దినదిన గండంగా ఉంది. గుడ్డలు మాసి పేలికలయ్యాయి. శవంలా తయారయ్యాను. రోజులు భారంగా గడవసాగాయి. పట్నంలో పాతబస్తీలో గోపీచంద్ అనే అతను కూలీల కోసం అన్వేషిస్తున్నాడని తెలిసింది - వెంటనే నేను వెళ్ళాను. అతను నాపరిస్థితి చూసి విచారించాడు. ఆ రోజు నుంచి నాకు కూలీ పని లభించింది. నా సహ కూలీ అయిన రామదాసుకి నాతో స్నేహం ఏర్పడింది. నేను ప్రతి రోజు కొంత డబ్బు కూడబెట్టి అతనికి ఇవ్వసాగాను. అతను దాన్ని దాచసాగాడు. మూడు నెలలయ్యేసరికి కొంత సొమ్ము సమకూరింది. మా పని కూడ ఆరోజే ముగిసింది. ఆ రోజే నన్ను మోసగించి రామదాసు పారిపోయాడు. ఇది నాలో తీవ్ర సంచలనం రేపింది. ఒకసారి నా తల్లితండ్రులను చూడాలనిపించింది. వెంటనే రైలెక్కి ఆతృతగా ఇంటికివెళ్ళాను. కాని... ..

అక్కడ ఇల్లు లేదు. అది పూర్తిగా నేలమట్టమయ్యింది. నన్ను గుర్తించిన చిన్ననాటి మిత్రుడు అసలువిషయం చెప్పాడు. నా తండ్రి ఆ తరువాత కూడా ఈషణ్మాత్రం మారలేదట. సరైన వైద్య సహాయంలేక తల్లి మరణించింది. తండ్రి పత్తా లేదు. చుట్టుపక్కల వాళ్లు శవాన్ని గూర్చి మునిసిపాలిటీకి తెలియజేయగా వాళ్ళు శవాన్ని బండిలో వేసుకొని వెళ్ళారట. నా చెల్లి విషయం ఎక్కడా తెలియలేదు. నా గుండెల్లో తీరని కోపం బడబాగ్నిలా లేచింది. తండ్రి కోసం వెతికాను. ఫలితం శూన్యం.

## 3. ఇదేమిటి?

నేను ఇక ఆ ఊరిలో ఉండదలచుకోలేదు. అక్కడ అన్నీపోయాయి. పీడకలలా గతం అనుభవాలు మిగిలాయి. ఆరోజే తిరిగి పట్నానికి వెళ్ళిపోయాను. చేతిలో చిల్లిగవ్వలేదు. ఇప్పుడెలా! అన్న ప్రశ్న మదిని తొలుస్తోంది. పనిదొరుకుతుందేమోనని పట్నం అంతాగాలించాను. ఎక్కడాదొరకలేదు. ఆ రోజు కొళాయి నీళ్ళతో ఆకలి తీర్చుకుని రైల్లో మరో టౌనుకు పయనమయ్యాను. ఆ ఊరిలో ఒక షావుకారువద్ద నౌఖరీ కుదిరాను. ఇక్కడే నాకు జ్యోతి అనే అమ్మాయితో పరిచయం కలిగింది. ఆ అమ్మాయి తండ్రి భుజంగరావు పెద్ద రాజకీయవేత్త. బాగా పలుకుబడి ఉన్నవాడు. ఎన్నికలలో పోటీ చేస్తున్నాడు. అతనికి పోటీగా రాజారాం నిలబడ్డాడు. రాజారాం అంటే నేను పనిచేస్తున్న షావుకారు. జ్యోతి నాతో ఉన్న స్నేహాన్ని పురస్కరించుకుని భుజంగరావు ఎన్నికను బలపర్చవలసిందని కబురు పంపించింది. రాజారాం నన్ను తన ప్రతినిధిగా పెట్టాలని నిర్ణయించుకుంటున్నాడు. ఇప్పుడు నా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క అయ్యింది. విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం. ఇప్పుడేం




చేయాలి!

## 4. నాకళ్ళముందే

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న భుజంగరావు ఆ టౌనకి, ఈటౌనుకి నడిచే తన ప్రైవేటు బస్సుని రాజకీయంలో ఇరికించారు. ఆ బస్సు మధ్య అడవిలో ఆగిపోయింది. ఇంతలో రాజారాం పార్టీ మనుషులు కొందరు దాన్ని ఆపి, ఆ బస్సులో ఎక్కివున్న భుజంగరావుతోసహా ప్రజలందర్నీ నిలువుదోపిడి చేశారు. తిరిగి వెళ్ళబోయే ముందు "భుజంగరావూ మేం రాజారాం మనుషులం. నీవు నీ నామినేషన్‌ను వెనక్కు తీసుకోకపోతే మళ్ళీ ఇదే ప్రయత్నం జరుగుతుంది" అని చెప్పి వెళ్ళిపోయారు. ఈ వార్త క్షణంలో పట్టణంలో మారుమ్రోగిపోయింది. ప్రజలు కోపోద్రిక్తులైనారు. ఈ సంఘటన దర్యాప్తులో ఉండగానే పోలింగు తేది రావడం, భుజంగరావు ఏకగ్రీవంగా ఎన్నికవడం జరిగాయి. కాని ఆ బస్సులో కండక్టరు తర్వాత గుట్టంతా బయట పెట్టాడు ఆ మనుషులు భుజంగరావు మనుషులేనని. ఇది విన్న రాజారాం భుజంగరావుని హత్య చేయడానికి ఇంకో ముగ్గుర్ని తోడిచ్చి నన్ను పంపాడు. ఆ రాత్రి భుజంగరావు పడగ్గదిలో కెళ్ళిన నాకు ఎవరో ఆడ మనిషి నవ్వులు విని పించాయి. జ్యోతేమోననుకున్నాను. కాని కిటికీలో నుంచి లోనికి చూచిన నేను షాక్ తగిలినట్లు నిలుచుండి పోయాను. భుజంగరావు ఒక ఉంపుడుగత్తెతో కులుకుతున్నాడు. అది కాదు నా బాధ. ఆ ఉంపుడు గత్తె ఎవరో కాదు. నా చెల్లెలు. బాధ, ఆనందమూ నన్ను ముప్పిరిగొన్నాయి. ఇంతలో మా అనుచరుడు ఒకడు కరెంటు తీసేసాడు. చీకటి .... గుసగుసలు.

క్షణంలో వాతావరణం మార్పు.

లోపల ఆ ఇద్దరి ప్రాణభీతి కేకలు-ఆ ఏర్ కండిషన్ గది దాటి బయటికి రావడం లేదు. నా కళ్ళ ముందే, నేను చూస్తుండగానే ఇద్దరి ప్రాణాలూ అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

## 5. అనుక్షణం ప్రాణభయం

ఈ వార్త నగరంలో సంచలనాన్ని రేపింది. భుజంగరావు మరణవార్తను పత్రికలన్నీ ప్రముఖంగా ప్రకటించాయి. చివరికి పోలీసులు హంతకునికోసం గాలించసాగారు. నాకు భయం పుట్ట సాగింది. పోలీసు కుక్కలు రంగంలోకి దిగాయి. నా సహచరులందరూ ఎక్కడికో గుర్తు తెలియని చోటుకి వెళ్ళిపోయారు. నేనుకూడా తిరిగి మా ఊరికి బయలుదేరాను. ఎందుకంటే మా ఊరికి పడమరగా వున్న అడవుల్లోకి పోతే ఇక ఎవరూ గుర్తించలేరు. నగరంలో నా గురించి ఎవరో ఆచూకీ తెలిపారు. నన్ను పట్టించినవారికి పదివేల రూపాయలు బహుమతి ప్రకటించారు. చావు ఎప్పుడు ముంచుకొస్తుందో తెలి ని పరిస్థితిలో కాలం గడుపుతున్నాను.

## 6. నమ్మకద్రోహం

ఇక్కడే....మరో విచిత్రమయిన మలుపు తిరిగింది. అడవిలో దొరికే ఆకు అలముతో కడుపు నింపుకొంటున్నాను. ఒకరోజు....టపటపా చినుకులతో వాన ప్రారంభమయింది. నాకు తెలిసినంత మేరకు ఒక పాడుబడిన భవనం ఉంది. అక్కడైనా తలదాచుకోవచ్చునని అక్కడకు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి సిగరెట్ కాలుస్తూ కూర్చొని ఉన్నాడు రామదాసు.

"కూర్చో" అన్నాడు. కూర్చున్నాను. క్షణాలు గడిచాయి.

"నీ డబ్బు ఇవ్వాలని వచ్చాను" అంటూ జేబులోంచి మూడు వచ్చనోట్లు తీసి నా చేతిలో ఉంచాడు. నీకిక్కడ ఆశ్రయం లేదు. కాబట్టి పల్లెలో నాగుడిసెలోకి వచ్చేయి"

నేను నివ్వెరబోయి మాటాడకుండా నిలబడ్డాను. రామదాసేనా ఇలా మాట్లాడేది? అతనివెంట కసాయివానివెంట మేకపిల్ల (అఫ్‌కోర్సు, నేను మేకపిల్లను కాదనుకోండి) వెళ్ళినట్లు బయలుదేరాను. కానీ అతను నేరుగా గుడిసెకు కాకుండా ఒక పెంకుటింటికి వెళ్ళి తలుపుతట్టాడు. ఒక నడివయస్కురాలు తలుపు తీసింది. ఆమెపేరు సీతమ్మ. ఆమె రామదాసువద్ద సర్వెంట్. ఆరోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. అటూఇటూ పచార్లు చేయసాగాను. ఇంతలో గోడవారగా ఏదో చప్పుళ్లు వినపడ్డాయి.

"....చ్చి...ది... దానికా!" అంటున్నది ఒక కంఠం. అది రామదాసుదని తేలిగ్గానే గుర్తించాను.

"....కపోతే .. స్తాను". "హా!.... మైనా ...గాక....ను"

ఆ కంఠం ఎవరిది? నాకేమీ పాలుపోలేదు. కొంత సమయం గడిచింది. సీతమ్మ వగరుస్తూ తలుపు నెట్టుకుని నా గదిలో కొచ్చింది. నేను విభ్రాంతిగా లేచి ఏమిటన్నట్లుగా ఆమెకేసి చూశాను. "బాబూ! ఇక్కడుంటే మీకే ప్రమాదం. రామదాసు మిమ్మల్ని పోలీసులకు పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

వాడు మహా కర్కోటకుడు. నామాట విని మీరు వెళ్ళిపోండి"

నాకు ఏమీ పాలుపోవడం లేదు. ఏవ్విటిదంతా. అన్యమనస్కుడినై నాను. ఆరాత్రి తిరిగి అడవిలోకి మకాం ఎత్తాను.

## 7. తండ్రిని చంపిన తనయుడు

మళ్ళీ సాదాసీదా జీవితం గడవ సాగింది. కొన్నిరోజులయ్యాక ఒక ఉదయం ఎవరో ఒకతను అడవిలో కట్టెలు కొట్టడం గమనించాను. అతనెవరో అని అక్కడకువెళ్ళాను. అతని ముఖాన్ని చూడగానే పాత జ్ఞాపకాలు ముప్పిరి గొన్నాయి. అతను నా తండ్రి. ఆనందం పట్టలేక ఒక్కుదుటున ముందుకువెళ్ళి "నాయనా! నేను ఈరేశుని" అన్నాను. అతని పెదవుల్లో విరిగిన విషాదపు నవ్వొకటి వెలిగి మాయమైంది. "నువ్వట్రా ఈరేశూ! ఏం జేస్తన్నవురా! ఏడుంటున్నవ్" అన్నాడు. అన్నిటికీ సమాధానం చెప్పేను. అడవిలోనే ఉన్న అతని గుడిశెవద్దకు తీసుకెళ్ళేడు. "లోపల నిశ్చింతగా పండుకోరా" అని భోజనంతెచ్చి నా ముందుంచేడు తిని పడుకొన్నాను. సమయం ఎంత గడిచిందో తెలీలేదు. ఎవరో నన్ను గట్టిగా తట్టి లేపడంతో మెలకువ వచ్చింది. నిర్ఘాంత పోయి చూచేను. కళ్ళు నులుముకుని మరీ చూసేను. ఎదురుగా డ్రస్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్, నలుగురు పోలీసులు నిల్చుని ఉన్నారు. వేన్‌కేసి చూసేను. తండ్రి కేసి చూశాను. నవ్వేడు నిశ్శబ్దంగా.

○ ○ ○ ○

నా నేరాలు ఋజువయ్యాయి. ఉరిశిక్ష తప్పదు. ఆఖరి కోరికేమిటని అడిగేరు. నాతండ్రిని అడవిలో గుడిశెవద్ద చూడా లన్నాను. అంగీకరించేరు. వేన్ గుడిశె ముందాగింది. తండ్రి అలికిడివిని బయట కొచ్చేడు. వేన్‌లోంచి ఊహించని రీతిలో దూకి పరిగెత్తి పక్కనే ఉన్న కట్టెతో అతని నెత్తిన పడ్డ ఒకే ఒక దెబ్బకు తల రెండుగా చీలింది. అందరూ వణకి పోయేరు. ఇన్‌స్పెక్టర్ పళ్ళునూరుతూ అన్నాడు "రాస్కెల్"

## 8. ఆత్మఘోష అనేది కథాంతం

నాకు జన్మ నిచ్చిన తండ్రినే చంపా నని నన్ను లోకం కోడై కూసింది. న్యాయ శాస్త్రిలు ఇది అధర్మమని ఘోషించేయి. ప్రజలు "ఇది కలియుగమ"ని ముక్కున వేలేసుకున్నారు.నేను వారన్న మాటల్లో దేనికీ చలించను.నాలో చలనం లేదు. నేనెప్పుడో చచ్చిపోయేను. చనిపోయి ఈనాడు జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. ఈలోకంలో నాతండ్రి లాంటి రాబందులు ఉన్నంత కాలం నా చరిత్ర మారదు. బహుశా మార లేదుకూడా.

ఎప్పుడో....

మిణుకు మిణుకు మంటున్న విశాల సంవత్సరాలలో చరిత్ర పునరావృతమవు తుంది. తొలికోడి కూస్తుంది. ఊర్లోని జనం అజ్ఞానాంధకారంలోంచి లేస్తారు. లేచి పళ్ళు విరుస్తారు. అంధకారం అలుముకోదు. అదృశ్యమవుతుంది. అప్పటివరకు నాలాంటి వారికి పరిష్కృతి ఉండదు. ★